# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

teluguprabha.net

-TeluguPrabha

@TeluguPrabhaofficial

TS వైబ్రెంట్ ఎడిషన్ 4 pm

మంగళవారం 1-8-2023




తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు

## ఢిల్లీలో ధర్నా

**న్యూఢిల్లీ, ఆగస్టు 1 (తెలుగుప్రభ)**

ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో తెలంగాణకు చెందిన కాంగ్రెస్ ఎంపీలు ధర్నా నిర్వహించారు. భారీ వర్షాలు, వరదలతో పంట నష్టపోయిన రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అయితే ఈ ధర్నాకు ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరుకాలేదు. లోక్ సభ వాయిదా పడినా ఉత్తమ్ కుమార్ రెడ్డి పార్లమెంట్‌లోనే ఉండిపోయారు.



## మార్కెట్‌కు రాహుల్‌గాంధీ

కూరగాయల ధరల గురించి ఆరా

**న్యూఢిల్లీ, ఆగస్టు 1 (తెలుగుప్రభ)**

కూరగాయల ధరలపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరా తీశారు. మంగళవారం ఉదయం ఢిల్లీలోని ఆజాద్ పూర్ మండీని ఆకస్మికంగా సందర్శించారు. తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో అక్కడికి చేరుకున్న రాహుల్.. మండీలో కలియతిరిగారు. అక్కడి కూరగాయలు, పండ్ల వ్యాపారులు, విక్రయదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రస్తుతం మార్కెట్ లో పండ్లు, కూరగాయల ధరలు ఎలా ఉన్నాయో వారిని అడిగి తెలుసుకున్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో అన్ని వర్గాల ప్రజలతో మాట్లాడిన విషయం తెలిసిందే. అదే పంథాను ఆయన ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. ఇటీవలే ట్రక్కు డ్రైవర్ల సమస్యలు తెలుసుకునేందుకు హర్యానాలో లారీ ఎక్కిన ఆయన వంద కిలోమీటర్ల వరకు అందులో ప్రయాణించారు. మధ్యలో ధాబాలో టీ తాగుతూ డ్రైవర్లతో మాట్లాడారు. అదేవిధంగా గత నెలలో ఢిల్లీలోని బైక్ మెకానిక్ వర్క్‌షాపుకు వెళ్లి.. పానా పట్టి బైక్‌ను ఎలా రిపేర్ చేయాలో మెకానిక్‌లను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత హర్యానాలోని సోనీపట్ సమీపంలో ఉన్న మదీనా గ్రామ శివారుల్లోని పొలాల్లో పనిచేసుకుంటున్న రైతులను కలిశారు.



## అందం చూసే..

మహిళా ఎంపీపై ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు

**మహారాష్ట్ర, ఆగస్టు 1 (తెలుగుప్రభ)**

శివసేన వర్గానికి చెందిన ఓ ఎమ్మెల్యే.. ఉద్ధవ్ ఠాక్రే వర్గంలోని ఓ మహిళా ఎంపీపై చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదం అయ్యాయి. దీంతో మరోసారి ఇరు వర్గాల మధ్య తీవ్ర మాటల యుద్ధానికి దారితీసింది. ఆ మహిళా ఎంపీతో పాటు ఉద్ధవ్ ఠాక్రే కుమారుడు ఆదిత్య ఠాక్రే కూడా తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాజ్యసభ ఎంపీ ప్రియాంకా చతుర్వేదిపై .. శివసేన వర్గానికి చెందిన ఎమ్మెల్యే సంజయ్ ప్రియాంక చతుర్వేది అందాన్ని చూసి.. ఉద్ధవ్ ఠాక్రే కుమారుడు ఆదిత్య ఠాక్రే.. ఆమెకు రాజ్యసభ ఎంపీ పదవిని కట్టబెట్టారని సంజయ్ శిర్సత్ అమర్యాదకరమైన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలే ప్రస్తుతం ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదానికి దారి తీశాయి. దీనిపై ప్రియాంకా చతుర్వేదితోపాటు ఆదిత్య ఠాక్రే కూడా స్పందిస్తూ.. సంజయ్ శిర్సత్‌పై ఎదురుదాడికి దిగారు. సంజయ్ శిర్సత్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై రాజ్యసభ ఎంపీ ప్రియాంక చతుర్వేది ట్విటర్ వేదికగా స్పందించారు. తాను ఎలా ఉన్నానో .. ఎక్కడ ఉన్నానో సంజయ్ శిర్సత్ లాంటి వాళ్లు చెప్పాల్సిన అవసరం లేదని.. గట్టిగా కౌంటర్ ఇచ్చింది. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సదరు ఎమ్మెల్యేకు తగదని.. ఇవి మహిళల హుందాను దిగజార్చేలా ఉన్నాయని బదులిచ్చారు. మహిళల అభిప్రాయాలను గౌరవించండని ప్రియాంక చతుర్వేది ట్వీట్ చేశారు. మరోవైపు.. ప్రియాంక చతుర్వేదిపై సంజయ్ శిర్సత్ చేసిన వ్యాఖ్యలపై ఆదిత్య ఠాక్రే కూడా తీవ్రంగా స్పందించారు. సంజయ్ శిర్సత్ చాలా వక్రబుద్ధితో ఆలోచిస్తున్నారని దుయ్యబట్టారు.



# కుయ్.. కుయ్..

## తెలంగాణలో 466 అంబులెన్స్‌లు కొత్తగా అందుబాటులోకి..

**హైదరాబాద్, ఆగస్టు 1 (తెలుగుప్రభ)**

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో స్కాములు ఉంటే తెలంగాణలో స్కీములు ఉన్నాయని మంత్రి హరీశ్ రావు అన్నారు. ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎక్కడ చూసిన కొట్లాటలు, అవినీతి కనిపిస్తాయని విమర్శించారు. ఆరోగ్య రంగంలో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. కరోనా కంటే పెద్ద జబ్బులు వచ్చినా రాష్ట్రం తట్టుకుంటుందని తెలిపారు. హైదరాబాద్ పీపుల్స్ ప్లాజాలో 466 అత్యవసర వాహనాలను ముఖ్యమంత్రి కేసీఆర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్య శాఖలో కొత్తగా 466 వాహనాలను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రం ఏర్పడేనాటికి ప్రతి లక్ష జనాభాకు ఒక అంబులెన్స్ ఉండేదని, కాని ప్రస్తుతం 75 వేల మందికి ఒక 108 వాహనం అందుబాటులో ఉందని చెప్పారు. అమ్మఒడి వాహనాలకు నిధులు కావాలని కోరగానే ముఖ్యమంత్రి కేసీఆర్ విడుదల చేశారని వెల్లడించారు. జననం నుంచి మరణం వరకు వైద్య, ఆరోగ్యశాఖ సేవలు అందిస్తున్నదని చెప్పారు. వైద్యారోగ్య శాఖలో ఐదంచెల వ్యవస్థను సీఎం కేసీఆర్ ఏర్పాటు చేశారని తెలిపారు. తమ మంత్రిత్వ శాఖను నీతి ఆయోగ్ సైతం అభినందించిందని గుర్తుచేశారు. ఎన్నికల్లో ఓట్ల కోసం సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదన్నారు. కుటుంబ పెద్దగా సీఎం కేసీఆర్ అనేక పథకాలను అమలుచేస్తున్నారని వెల్లడించారు.

## మహారాష్ట్రలో బిజీ బిజీగా కేసీఆర్

**మహారాష్ట్ర, ఆగస్టు 1 (తెలుగుప్రభ)**

తెలంగాణలో కొత్త అంబులెన్స్‌లను ప్రారంభించిన ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు అనంతరం బేగం పేట విమానాశ్రయం నుంచి మహారాష్ట్ర బయల్దేరి వెళ్లారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మహారాష్ట్ర పర్యటనలో భాగంగా కొల్హాపూర్‌లో మహాలక్ష్మి స్వరూపమైన అంబబాయి అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి సాంగ్లి జిల్లాలోని వాటేగావ్ గ్రామంలో మధ్యాహ్నం ప్రముఖ సంఘ సంస్కర్త దివంగత అన్నాభావూ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. మహారాష్ట్ర యుగకవిగా, దళిత సాహిత్య చరిత్రలో ఆద్యుడిగా పేరొందిన అన్నాభావు సాతే 103వ జయంతి వేడుకల్లో పాల్గొని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు.

ఒంటిగంటకు అన్నాభావూ కుటుంబ సభ్యులను కలిశారు. 1.30 గంటలకు ఇస్లాంపూర్‌లోని రఘునాథ్ దాదా పాటిల్ ఇంట్లో భోజనం చేశారు. కొల్హాపూర్‌లోని సాధు మహారాజ్ సమాధి వద్ద నివాళి అర్పించారు. నాగాల పార్క్‌లోని పుధరి న్యూస్‌పేపర్ యజమాని ఇంటికి వెళ్లి ఆయనతో సమావేశం అయ్యారు. సాయంత్రం 5 గంటలకు విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు.



# చేసింది చెబుదాం..

- ప్రజానుకూల నిర్ణయాలు ప్రజలకు చెప్పండి
- ప్రభుత్వోగులుగా ఆర్టీసీ కార్మికుల అంశాల్ని తెలియజేయండి
- ఎక్కడికక్కడ సంబరాలు జరపండి

## బీఆర్ఎస్ నేతలతో టెలీకాన్ఫరెన్స్‌లో కేటీఆర్

**హైదరాబాద్, ఆగస్టు 1(తెలుగుప్రభ):**

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర రావు గారి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అద్భుతమైన ప్రజానుకూల నిర్ణయాలను ప్రజల్లోకి మరింత తీసుకువెళ్లేలా ప్రయత్నించాలని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు పార్టీ శ్రేణులను కోరారు. మంగళవారం పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ జనరల్ సెక్రటరీలు, జిల్లా పార్టీ అధ్యక్షులతో టెలీకాన్ఫరెన్స్ సమావేశాన్ని నిర్వహించారు. దేశ చరిత్రలో ఏ ప్రభుత్వము కూడా గతంలో ఎన్నడూ తీసుకొని విధంగా ఉద్యోగుల పట్ల ఎంతో ఔదార్యంతో తీససుకున్న నిర్ణయాన్ని ఆయా వర్గాల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మన పైన ఉన్నదని కేటీఆర్ ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు. తాజాగా 21 వేల మంది వీఆర్ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి మానవీయతను చాటుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తాజాగా ఆర్టీసీ ఉద్యోగులందరినీ ప్రభుత్వ పరిధిలోకి తీసుకువచ్చి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం వారి పట్ల ప్రభుత్వానికి ఉన్న మానవీయతను చాటి చెబుతుందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని బస్సు డిపోల ముందు ఆర్టీసీ కార్మికులతో కలిసి సంబరాలు నిర్వహించాలని పార్టీ నాయకులకు కేటీఆర్ కోరారు. దీంతోపాటు ఒకటి రెండు రోజుల్లో అటు వీఆర్ఏల కుటుంబాలతోను, ఆర్టీసీ కార్మికులతోను ప్రత్యేకంగా ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మెల్యేలకు, నియోజకవర్గ ఇన్చార్జి లకు కేటీఆర్ సూచించారు. కేవలం ఉద్యోగుల పట్లనే కాకుండా రాష్ట్రంలో ఉన్న అనాథలందరినీ ఒక పాలసీ కిందకు తీసుకువచ్చి, వారి బాధ్యత పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే తీసుకునేలా తీసుకున్న నిర్ణయం కూడా అత్యంత మానవీయమైన పరిపాలన నిర్ణయం అని ఈ సందర్భంగా కేటీఆర్ అన్నారు.

**బలోపేతం కానున్న ప్రజారవాణా**

రాష్ట్ర రాజధానిలో ప్రస్తుతం 70 కిలోమీటర్లున్న మెట్రోను 415 కిలోమీటర్లకు విస్తరించేలా భారీ ప్రణాళికను ప్రకటిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఎక్కడికక్కడ బీఆర్ఎస్ పార్టీ ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కేటీఆర్ సూచించారు. ముఖ్యంగా విస్తరణ తర్వాత మెట్రో అందుబాటులోకి వచ్చే నియోజకవర్గాల్లో స్థానిక పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించాలని కేటీఆర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో హైదరాబాద్ ప్రజా రవాణా వ్యవస్థ మరింతగా బలోపేతం అవుతుందని, నగర విస్తరణకు అనేక సానుకూల అంశాలు ఏర్పడతాయన్న అంశాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. మెట్రో విస్తరణ పూర్తి అయితే హైదరాబాద్ చుట్టుపక్కలున్న సుదూర ప్రాంతాలు కూడా వేగంగా అభివృద్ధి చెందుతాయన్న విశ్వాసాన్ని ప్రజలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాల వలన ఇబ్బందుల పాలైన ప్రజలకు ఉపశమనం అందించేలా రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సహాయంగా ప్రకటించిన రూ. 500 కోట్ల ప్రజలకు ఉపయుక్తంగా ఉంటాయన్న విశ్వాసాన్ని కేటీఆర్ వ్యక్తం చేశారు.



## తగ్గిన గ్యాస్ సిలిండర్ ధర

**న్యూఢిల్లీ, ఆగస్టు 1 (తెలుగుప్రభ)**

ఆగస్టు నెలలో కమర్షియల్ గ్యాస్ వినియోగదారులకు శుభవార్త అందింది. దేశీయ చమురు మార్కెటింగ్ కంపెనీలు వంట గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు ఊరట కలిగించే నిర్ణయం తీసుకున్నాయి. 19 కేజీల ఎల్పీజీ సిలిండర్ ధరను రూ.99.75 మేర తగ్గించాయి. దీంతో దేశ రాజధాని దిల్లీలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.1,680కు దిగొచ్చింది. అయితే గృహ వినియోగ సిలిండర్ ధరలో మాత్రం ఎటువంటి మార్పు లేదు. కొత్త ధరలు నేటి నుంచి అమలులోకి వచ్చాయి. అదేసమయంలో 14.2 కేజీల సిలిండర్ విషయానికి వస్తే.. ఈ సిలిండర్ ధర ఢిల్లీలో రూ. 1103 వద్దనే స్థిరంగానే కొనసాగుతోంది. ఈ సిలిండర్ ధర చివరిగా మార్చి 1న మారింది. అప్పటి నుంచి సిలిండర్ ధరలో మార్పు లేకుండా ఉంది.



## కోట్లు కొట్టేసి.. రూ. 10 వేల కోసం దొరికేశాడు..

**సికింద్రాబాద్, ఆగస్టు 1 (తెలుగుప్రభ)**

కోట్లు కొట్టేసి తప్పించుకు తిరుగుతున్నాడు. అయితే.. రూ. పది వేల జీతం బకాయి ఉందని యజమానికి ఫోన్ చేసి దొరికేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేపాల్ కైలాల్ జిల్లా తిక్కాపూర్ నివాసి భరత్ బిస్తా (25) అనే యువకుడు కూలీ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. నేపాల్‌లో సెల్‌ఫోన్, ఓ ఇంట్లో చోరీ చేసిన కేసుల్లో అతడు జైలుకెళ్లొచ్చాడు. ఆ తర్వాత ఇండియాకు వచ్చి పుణేలోని ఓ హోటల్‌లో పనికి కుదిరాడు. సింధికాలనీలోని వ్యాపారి గోయల్ ఇంట్లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న కమల్.. యజమాని ఇంట్లో చోరీ చేసేందుకు ప్లాన్ చేశాడు. రెండుసార్లు నేపాల్ నుంచి కొందరు యువకుల్ని రప్పించి ప్రయత్నించి ఫెయిల్ అయ్యాడు. దీంతో బేగంపేట్ ప్రకాశ్ నగర్‌లో ఉంటున్న బహదూర్ తప్పా, తమ్ముడు మోహన్‌సౌద్ సాయంతో అప్పటికే రెండు చోరీలకు పాల్పడిన భరత్‌ను రంగంలోకి దింపారు.గతనెల 9న గోయల్ కుటుంబం బయటకు వెళ్తున్న విషయాన్ని కమల్ ముందే భరత్‌కు చేరవేశాడు. వ్యాపారి కుటుంబం వెళ్లగానే పుణే నుంచి భరత్ చోరీకి పాల్పడ్డాడు. వాటిని కమల్ తన గదికి తీసుకురాగా.. అతడి భార్య పార్వతి కుప్పలుగా పోసి వాటాలు పంచుకున్నారు. ఆ తర్వాత ఆ డబ్బుతో పారిపోయేందుకు ప్రయత్నించగా.. నేపాల్ సరిహద్దుల్లో కొందరు పట్టుబడ్డారు. భరత్ మాత్రం అప్పుడు పోలీసులకు చిక్కలేదు. నగదు, నగలతో భరత్‌బిస్తా పోలీసులనుంచి తప్పించుకునేందుకు తన సెల్‌ఫోన్లు పారేశాడు. రూ.2 లక్షలు వెచ్చించి మరో కొత్త సెల్‌ఫోన్ సిమ్ కార్డు కొన్నాడు. అతడు గతంలో పని చేసిన హోటల్ యాజమాన్యం ప్రతినెలా జీతం డబ్బులు బ్యాంకు అకౌంట్‌లో జమ చేస్తూ ఉంటారు. పోయిన నెల జీతం డబ్బులు అందకపోయే సరికి.. ఆ జీతం కోసం భరత్ హోటల్ నిర్వాహకులకు కాల్ చేశాడు. అప్పటికే నిందితుల ఫోన్ నంబర్లు, కాల్ లిస్ట్‌పై నిఘా ఉంచిన పోలీసులు.. భరత్‌ను పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి మిగిలిన సొత్తు రికవరీ చేశారు.



## ప్రభుత్వ ఆస్పత్రిలో దారుణం

మృతదేహాన్ని ఎలుకలు కొరికేయడంతో..

**భువనగిరి, ఆగస్టు 1 (తెలుగుప్రభ)**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆసుపత్రి మార్చురీలో దారుణం చోటుచేసుకుంది. మార్చురీలో సిబ్బంది నిర్లక్ష్యంతో మృతదేహాన్ని ఎలుకలు కొరుక్కుతిన్నాయి. ఆదివారం భువనగిరి పట్టణంలోని ప్రగతినగర్‌కు చెందిన లారీ డ్రైవర్ రవి మద్యానికి బానిసై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి జిల్లా ఆసుపత్రి మార్చురీకి మృతదేహాన్ని తరలించారు. ఉదయం పోస్టుమార్టం చేయడానికి వెళ్లగా రవి కుటుంబ సభ్యులు... ముఖంపై ఎలుకలు కొరికినట్లు గుర్తించారు. దీంతో కుటుంబ సభ్యులు మార్చురీ సిబ్బందిని నిలదీశారు. సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.